బలగం TV
BALAGAM
నిజమే మా బలం.. ప్రజలే మా బలగం
BALAGAM TV DIGITAL NEWS PAPER | balagamtv100@gmail.com
హైదరాబాద్ మంగళవారం 17 సెప్టెంబర్ 2024 | www.balagamtv.com | పేజీలు 4

## నేడు 600 ప్రత్యేక బస్సులు



**బలగం టీవి, హైదరాబాద్**

హైదరాబాద్ మహానగరం గణేశ్ నిమజ్జనానికి సిద్ధమైంది. గణేశ్ శోభాయాత్రతో పాటు నిమజ్జన వేడుకను వీక్షించాలనుకునే భక్తుల కోసం టీజీఎస్ ఆర్టీసీ ప్రత్యేక బస్సులను నడపాలని నిర్ణయించింది. నగర వ్యాప్తంగా 600 ప్రత్యేక బస్సులను నడపనున్నట్లు ఆర్టీసీ ఎండీ వీసీ సజ్జనార్ తెలిపారు. నగరంలోని అన్ని ప్రాంతాల నుంచి హుస్సేన్ సాగర్ పరిసర ప్రాంతాల వరకు బస్సులు అందుబాటులో ఉంటాయన్నారు. గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 30 డిపోల నుంచి 15 - 30 బస్సులు అందుబాటులో ఉంటాయని, భక్తులు వీటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రత్యేక బస్సులతో పాటు తదితర వివరాల కోసం రేతిఫైల్(9959226154), కోఠి బస్టాండ్(9959226160)లలో సంప్రదించాలన్నారు.

# భారతదేశాన్ని మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దుతాం

- **16 నగరాలను మోడల్ సోలార్ సిటీగా మార్చాలనేదే లక్ష్యం**
- **గుజరాత్‌లో పునరుత్పాదక శక్తి స్థాపిత సామర్థ్యం 50 వేల మెగావాట్లను దాటింది.**
- **వంద రోజుల పాలన ట్రైలర్ మాత్రమే.. సినిమా ముందుంది**
- **ప్రధాని మోడీ**



**బలగం టీవి, న్యూఢిల్లీ బ్యూరో**

140 కోట్ల జనాభా కలిగిన భారత దేశాన్ని ప్రపంచంలోనే మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దుతామని ప్రధాని మోడీ అన్నారు. మూడవ సారి అధికారంలోకి వచ్చిన మొదటి 100 రోజుల్లో వేగవంతమైన అభివృద్ధి దిశగా అడుగులు వేశామన్నారు. ప్రతి రంగంలో సవాళ్లను ఎదుర్కొనేందుకు ప్రయత్నించామన్నారు. యూపీలోని అయోధ్యను మోడల్ సోలార్ సిటీగా తీర్చిదిద్దేందుకు ప్రయత్నాలు ముమ్మరంగా జరుగుతున్నాయన్నారు. గుజరాత్ గాంధీనగర్ లో నాల్గొవ గ్లోబల్ రెన్యూవబుల్ ఎనర్జీ ఇన్వెస్టర్స్ మీట్ అండ్ ఎక్స్ పోని సోమవారం మోదీ ప్రారంభించారు.

ఈ సందర్భంగా ప్రధాని మాట్లాడుతూ బీజేపీ100 రోజుల పాలనలో తీసుకున్న నిర్ణయాలు కేవలం ట్రైలర్ మాత్రమేనని.. అసలు సినిమా ముందు ఉందని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. 2047నాటికి దేశాన్ని అభివృద్ధి చెందిన దేశంగా నిలపాలన్న లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వంలో పనిచేస్తున్నామన్నారు. భారతదేశంలో కనిపించే వైవిధ్యం, సామర్థ్యంపనితీరు అన్నీ ప్రత్యేకమైనవేనని ప్రధాని మోదీ అన్నారు. అందుకే 'ఇండియన్ సొల్యూషన్స్ ఫర్ గ్లోబల్ అప్లికేషన్స్' అని అంటున్నానని, దీనిని ప్రపంచం కూడా అర్థం చేసుకుంటుందన్నారు. అయోధ్యతో పాటు మరో 16 నగరాలను మోడల్ సోలార్ సిటీగా మార్చాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. అయోధ్య రాముడి జన్మస్థలం. అతడు సూర్యవంశీ. అయోధ్యలో రాముడి యొక్క గొప్ప ఆలయం నిర్మించబడింది. అక్కడ మరి కొన్ని రోజుల్లో సోలార్ సిటీ పనులు పూర్తి అవుతాయని తెలిపారు. నేటి భారతదేశం రాబోయే 1000 సంవత్సరాలకు పునాదిని సృష్టిస్తోంది. మా లక్ష్యం అగ్రస్థానానికి చేరుకోవడమే కాదు.. అగ్రస్థానంలో నిలదొక్కుకోవడం కూడా. 2047 నాటికి అభివృద్ధి చెందిన దేశంగా మారడానికి భారతదేశానికి దాని శక్తి అవసరాలు తెలుసు. అందుకు మన దగ్గర స్వంత చమురు, గ్యాస్ నిల్వలు లేవని కూడా మనకు తెలుసు... కాబట్టి మేము మన భవిష్యత్తును సౌర, పవన, అణు, జల శక్తులపై నిర్మించాలని నిర్ణయించుకున్నామని ప్రధాని మోదీ అన్నారు.

గుజరాత్ సీఎం భూపేంద్ర పటేల్ మాట్లాడుతూ ప్రధాని మోదీ నాయకత్వంలో పునరుత్పాదక ఇంధన రంగంలో గుజరాత్ అగ్రగామిగా నిలిచిందని, రాష్ట్ర పునరుత్పాదక ఇంధన విధానం, గ్రీన్ హైడ్రోజన్ విధానం హరిత భవిష్యత్తుపై రాష్ట్ర ప్రభుత్వ నిబద్ధతను ప్రతిబింబిస్తున్నాయన్నారు. గుజరాత్‌లో పునరుత్పాదక శక్తి స్థాపిత సామర్థ్యం 50 వేల మెగావాట్లను దాటింది. సోలార్ ఎనర్జీ ఇన్‌స్టాలేషన్‌లో గుజరాత్ దేశంలోనే అగ్రస్థానంలో ఉందని పటేల్ అన్నారు.ఈ కార్యక్రమంలో ఏపీ సీఎం చంద్రబాబు, తెలంగాణ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, కేంద్రమంత్రులు పాల్గొన్నారు.



## కొత్త రేషన్ కార్డులపై కీలక ప్రకటన

**బలగం టీవి, హైదరాబాద్**

తెలంగాణలో కొత్త రేషన్ కార్డులపై రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. అక్టోబర్ లో అర్హులైన ప్రతి ఒక్కరికి రేషన్ కార్డులు జారీ చేస్తామని ప్రకటించింది. న్యూ రేషన్ కార్డులకు సంబంధించి సెప్టెంబర్ 16న కేబినెట్ సబ్ కమిటీ సమావేశం అయింది. సబ్ కమిటీ భేటీ తర్వాత రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి వివరాలు వెల్లడించారు.

వీలైనంత త్వరగా కార్డులను జారీ చేయడం సహా జనవరి నుంచి రేషన్ కార్డుదారులకు సన్నబియ్యం ఇస్తామన్నారు. కాంగ్రెస్ ప్రజాపాలనతో తెలంగాణలో ఇది మరో విప్లవమాత్మకమైన మార్పు మార్క్ అంటూ పేర్కొన్నారు. ప్రస్తుతం తెలంగాణలో సుమారు 90 లక్షల రేషన్ కార్డులు ఉన్నాయని తెలిపారు. రేషన్ కార్డులు ఉన్నవారందరికీ 6 కిలోల ఉచిత బియ్యం ఇస్తున్నట్లు గుర్తు చేశారు. గత ప్రభుత్వంలో కేవలం 49వేల 476 రేషన్ల కార్డులు మాత్రమే ఇచ్చారని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. అదీ కూడా ఉప ఎన్నికలు జరిగిన నియోజవర్గాల్లో మాత్రమే జారీ చేశారన్నారు.అర్హులైన వాళ్లందరికి స్మార్ట్ రేషన్ కార్డులు, స్మార్ట్ హెల్త్‌కార్డులు ఇవ్వాలన్నదే తమ ప్రభుత్వ లక్ష్యం అన్నారు. ఇతర రాష్ట్రాల్లో రేషన్ కార్డులు ఏ ప్రాతిపదికన ఇస్తున్నారో అధ్యయనం చేశామన్నారు మంత్రి ఉత్తమ్. విధివిధానాల రూపకల్పనలో సలహాలు సూచనలు ఇవ్వాల్సిందిగా అన్ని పార్టీలకు లేఖ రాశామన్నారు. కొందరి నుంచి సూచనలు వచ్చాయన్నారు. రాజకీయాలకు అతీతంగా సూచనలు , సలహాలను తప్పక స్వీకరిస్తామన్నారు మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి.. ఈ 19లోగా ప్రజాప్రతినిధులు తమ సలహాలు సూచనలు ఇవ్వొచ్చన్నారు.21న మరోసారి సమావేశమై ఈ నెలఖారుకల్లా విధి విధానాలను ఖరారు చేస్తామన్నారు. పేద, మధ్యతరగతి వర్గాల్లో అర్హులైన ప్రతీ ఒక్కరికి స్మార్ట్ రేషన్ కార్డ్, స్మార్ట్ హెల్త్ కార్డ్ అందుంతని భరోసానిచ్చారు. అందరి సూచనలు, సలహాలను పరిగణలోకి తీసుకొని ఈ నెలఖారు కల్లా కేబినెట్ సబ్ కమిటీ నివేదిక ఇవ్వనుంది.

## 5 వందేభారత్ రైళ్లను ప్రారంభించిన ప్రధాని



**బలగం టీవి, న్యూఢిల్లీ బ్యూరో**

గుజరాత్‌లోని అహ్మదాబాద్‌లో ఐదు వందేభారత్ ఎక్స్‌ప్రెస్‌లను ప్రధాని మోడీ వర్చువల్‌గా ప్రారంభించారు. విశాఖ–దుర్గ్ , సికింద్రాబాద్–నాగ్‌పూర్, ఆగ్రా–బనారస్, కొల్హాపూర్–పుణే, పుణే–హుబ్లీ మధ్య ఈ రైళ్లు నడుస్తాయి. అహ్మదాబాద్‌లో రూ. 8000 కోట్లతో చేపట్టిన అభివృద్ధి పనులను సైతం ప్రధాని మోదీ ప్రారంభించారు. ఈ పర్యటనలో భాగంగా.. గుజరాత్‌లోని భుజ్– అహద్మాబాద్ మధ్య కొత్త రైలు సర్వీసును ప్రధాని మోదీ ప్రారంభించారు.

### తెలుగు రాష్ట్రాలకు
## రెండు వందే భారత్ రైళ్లు

**బలగం టీవి, న్యూఢిల్లీ బ్యూరో**

ఏపీ నుంచి దుర్గ్–విశాఖపట్నం వందేభారత్ రైలు, తెలంగాణ నుంచి నాగపూర్–సికింద్రాబాద్ రైలును ప్రధాని మోడీ ప్రారంభించారు.దుర్గ్–విశాఖపట్నం వందేభారత్ రైలు దుర్గ్ నుంచి వారానికి ఆరు రోజులు (గురువారం మినహా) ఉదయం 5.45 గంటలకు బయలుదేరుతుంది. అదేరోజు మధ్యాహ్నం 1.45 గంటలకు విశాఖపట్నం చేరుకుంటుంది. విశాఖ నుంచి మధ్యాహ్నం 2.30 గంటలకు ప్రారంభమై, రాత్రి 10.50 గంటలకు దుర్గ్‌కు చేరుకుంటుంది. ఈ నెల 20వ తేదీ నుంచి ఈ రైలు రెగ్యులర్‌గా తిరగనుంది.

ఇక సికింద్రాబాద్–నాగపూర్ వందేభారత్ రైలు ఈ నెల 19వ తేదీ నుంచి అందుబాటులోకి రానుంది. మంగళవారం మినహా మిగతా ఆరు రోజులు ఈ రైలు నడుస్తుంది. ఈ రైలు ప్రతిరోజు ఉదయం 5.00 గంటలకు నాగ్‌పూర్ నుంచి బయలుదేరి సేవాగ్రామ్, చంద్రాపూర్, బల్లార్షా, రామగుండం, కాజీపేట మీదుగా సికింద్రాబాద్‌కు మధ్యాహ్నం 12.15 గంటలకు చేరుకుంటుంది. మధ్యాహ్నం 1 గంటలకు సికింద్రాబాద్ నుంచి బయలుదేరి రాత్రి రాత్రి 8.20 గంటలకు నాగపూర్ చేరుకుంటంది. మహారాష్ట్ర–తెలంగాణ మధ్య ఇదే తొలి వందేభారత్ రైలు. అంతేకాదు, దక్షిణ మధ్య రైల్వే పరిధిలో ఇదే అతిపెద్ద వందేభారత్ రైలు. దీంట్లో 20 కోచ్ లు ఉంటాయి

## 'నమో భారత్' రైలు ప్రారంభం

**బలగం టీవి, న్యూఢిల్లీ బ్యూరో**

'వందే మెట్రో' రైళ్ల పేరును 'నమో భారత్ ర్యాపిడ్ రైల్'గా కేంద్ర ప్రభుత్వం మార్చింది. ఈ మేరకు మొదటి రైలు ప్రారంభానికి ముందు నిర్ణయం తీసుకుంది. ఇప్పటివరకు మెట్రో రైళ్లు నగరాల్లోనే నడిచేవి. నగరాల మధ్య మెట్రో రైళ్లు నడిపించాలనే ఆలోచనతో ఈ నూతన రైళ్లను రైల్వే శాఖ తీసుకువస్తున్నది. గుజరాత్‌లోని అహ్మదాబాద్ – భుజ్ మధ్య నడిచే మొదటి 'నమో భారత్ ర్యాపిడ్ రైల్'ను ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సోమవారం అహ్మదాబాద్‌లో ప్రారంభించారు.

## విప్లవాత్మకమైన మార్పులు తీసుకొచ్చిన రాజీవ్ గాంధీ



- **గాంధీ కలలు కన్న గ్రామ స్వరాజ్యాన్ని సాకారం చేసిన నేత**
- **రాజీవ్ విగ్రహాన్ని ఎవరు తొలగిస్తారో చూస్తాం**
- **బీఆర్ఎస్ నేతలు చేసిన త్యాగాలేంటి**
- **సీఎం రేవంత్‌రెడ్డి**



**బలగం టీవి, హైదరాబాద్**


దేశ భవిష్యత్తుకు బంగారు బాటలు వేయాలన్న సమున్నతమైన ఆశయంతో మాజీ ప్రధానమంత్రి, స్వర్గీయ రాజీవ్ గాంధీ అనేక విప్లవాత్మకమైన మార్పులు తీసుకొచ్చారని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి చెప్పారు. తెలంగాణ సచివాలయం ఎదుట ఏర్పాటు చేసిన రాజీవ్ గాంధీ విగ్రహాన్ని ముఖ్యమంత్రి ఆవిష్కరించారు. రాష్ట్ర మంత్రులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్న ఈ కార్యక్రమంలో సీఎం మాట్లాడుతూ, రాజీవ్ గాంధీ, వారి కుటుంబం దేశం కోసం చేసిన త్యాగాలను గుర్తుచేశారు.దేశ భవితవ్యాన్ని యువత నిర్దేశించాలన్న లక్ష్యంతో 18 ఏళ్లకు ఓటు హక్కు కల్పించడం, పంచాయతీలే పట్టుగొమ్మలని విశ్వసించి వాటికి నేరుగా నిధులు చేర్చాలన్న సంకల్పంతో 73, 74 వ రాజ్యాంగ సవరణ చేయడం, చట్ట సభల్లో మహిళలకు రిజర్వేషన్లు కల్పించడం, సాంకేతిక విప్లవంతో దేశాన్ని 21 శతాబ్దంలోకి నడిపించడం వంటి రాజీవ్ గాంధీ తీసుకొచ్చిన సంస్కరణలను వివరించారు.

దేశం కోసం నెహ్రూ కుటుంబం సర్వం కోల్పోయిందని, నెహ్రూ ప్రధానిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత దేశాన్ని ప్రగతి బాటన నడిపించడానికి ఆనాడు ఎడ్యుకేషన్, ఇరిగేషన్ రంగాలకు ప్రాధాన్యతనిచ్చారని అన్నారు. బాక్రానంగల్, నాగార్జునసాగర్, శ్రీశైలం, శ్రీరాం సాగర్ వంటి ప్రాజెక్టులు ఈనాటికీ నెహ్రూ దూరదృష్టికి సజీవ సాక్ష్యాలుగా నిలుస్తున్నాయన్నారు. 563 సంస్థానాలను దేశంలో విలీనం చేయించి దేశ సమగ్రతను కాపాడిన ఘనత నెహ్రూ గారిదని కొనియాడారు.

బ్యాంకుల జాతీయాకరణ, రాజభరణాల రద్దుతో పాటు దళిత, గిరిజన, బడుగు బలహీన వర్గాల ఆత్మగౌరవం పెరిగేలా

మిగితా 2వ పేజీలో

# నిమజ్జనాలకు అంతా రెడీ



- **హైదరాబాద్‌లో 25 వేల మంది పోలీసులతో బందోబస్తు**
- **ఐదువేలకుపైగా సీసీ కెమెరాల ఏర్పాటు**
- **ట్రాఫిక్ ఆంక్షలు**

**బలగం టీవి, హైదరాబాద్**

హైదరాబాద్ నగరంలో వినాయక నిమజ్జనాలకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. నిమజ్జనం బందోబస్తు కోసం 25 వేల మంది పోలీసులను సిద్ధం చేశారు. ఈ నేపథ్యంలో హైదరాబాద్‌లో పలు ప్రాంతాల్లో ట్రాఫిక్ పోలీసులు ఆంక్షలు విధించారు. గణేశ్ నిమజ్జనం శోభాయాత్రలు సాగే దారుల్లో సాధారణ వాహనదారులకు ట్రాఫిక్ ఆంక్షలు పెట్టారు. మంగళవారం ఉదయం 6 గంటల నుంచి బుధవారం రాత్రి 10 గంటల వరకూ ట్రాఫిక్ పోలీసులు అంక్షలను విధించారు.

బాలాపూర్ నుంచి ఎన్టీఆర్ మార్గ్ వరకు సాగే ప్రధాన గణేశ్ నిమజ్జనం శోభాయాత్ర రహదారుల్లో సాధారణ ప్రజల వాహనాల రాకపోకలకు అనుమతించమని పోలీసులు వెల్లడించారు. ఇతర రాష్ట్రాలు, జిల్లాల నుంచి వచ్చే భారీ వాహనాలను సోమవారం అర్ధరాత్రి నుంచి హైదరాబాద్‌లోకి అనుమతి లేదని అధికారులు తెలిపారు. నగరం నుంచి ఇతర ప్రాంతాలకు వెళ్లే ప్రైవేటు బస్సులు ఓఆర్ఆర్‌తో పాటు ఇతర మార్గాల ద్వారా వెళ్లాలని సూచించారు. హైదరాబాద్ పాతబస్తీలో కేశవగిరి, మహబూబ్‌నగర్ చౌరస్తా, ఇంజిన్ బౌలి, నాగుల్ చింత, హిమ్మత్‌పురా, హరిబౌలి, అస్రా హాస్పిటల్, మొఘల్ పురా, మదీనా చౌరస్తా, ఎంజే బ్రిడ్జి, దారుల్ షిఫా చౌరస్తా, సిటీ కాలేజి వద్ద వాహనాలను మళ్లిస్తామని తెలిపారు.

గణేశ్ నిమజ్జన సమయంలో పలు ప్రాంతాల్లో

మిగితా 2వ పేజీలో


### శోభాయాత్ర మార్గాలు ఇవే..

బాలాపూర్ నుంచి వచ్చే గణేషుడి శోభాయాత్ర చాంద్రాయణగుట్ట, ఫలక్‌నుమా రైల్వే ఓవర్ బ్రిడ్జి, నాగుల చింత, చార్మినార్, అఫ్జల్‌గంజ్, ఎంజేమార్కెట్, అబిడ్స్, బషీర్‌బాగ్, లిబర్టీ, అంబేద్కర్ విగ్రహం, ఎన్టీఆర్ మార్గ్, నెక్లెస్ రోడ్డు వరకు ప్రధాన శోభయాత్ర జరుగుతుంది.

సికింద్రాబాద్ వైపు వచ్చే యాత్ర ఆర్పీరోడ్డు, ఎంజేరోడ్డు, కర్బాలమైదాన్, కవాడిగూడ, ముషీరాబాద్ క్రాస్ రోడ్డు, ఆర్టీసీ క్రాస్ రోడ్డు, నారాయణగూడ క్రాస్‌రోడ్డు, హిమాయత్‌నగర్ వై జంక్షన్ నుంచి ప్రధాన యాత్రలో కలుస్తాయి. చిలకలగూడ వైపు నుంచి వచ్చే యాత్ర గాంధీ దవాఖాన వద్ద నుంచి ఆర్టీసి క్రాస్ రోడ్స్, నారాయణగూడ ఫ్లై ఓవర్, నారాయణగూడ వై జంక్షన్, హిమాయత్‌నగర్ నుంచి లిబర్టీ వద్ద ప్రధాన ర్యాలీకి కలుసుకోవాలి.

ఉప్పల్ వైపు నుంచి వచ్చే గణనాథులను శ్రీరమణ జంక్షన్, 6 నెం. జంక్షన్, తిలక్‌నగర్, శివమ్ రోడ్డు, ఎన్‌సీసీ, విద్యానగర్ టీ జంక్షన్, హిందీ మహావిద్యాలయ, ఫీవర్ ఆసుపత్రి, బర్కత్‌పురా, వైఎంసీఏ, నారాయణగూడ ఎక్స్ రోడ్స్ వద్ద.. ఆర్టీసీ క్రాస్ రోడ్డు వైపు నుంచి వచ్చే ర్యాలీలో కలుసుకోవాలి. అలాగే దిల్‌సుఖ్‌నగర్, ఐఎస్ సదన్, సైదాబాద్ వైపు నుంచి నల్గొండ క్రాస్‌రోడు వైపు నుంచి వచ్చే వినాయక విగ్రహాలు.. మూసారాంబాగ్, అంబర్‌పేట్ మీదుగా హిమాయత్‌నగర్ వైపుకు వెళ్లి ప్రధాన ర్యాలీలో కలవాలి. అలాగే తర్నాక నుంచి వచ్చే వాహనాలు ఫీవర్ ఆసుపత్రి వద్ద నుంచి ప్రధాన ర్యాలీలో కలుసుకోవాలి.

టోలిచౌకీ, మెహిదీపట్నం వైపు నుంచి వచ్చే వాహనాలు మాసబ్‌ట్యాంక్, నిరంకారీ, ఓల్డ్ సైఫాబాద్, ఇక్బాల్ మినార్ నుంచి ఎన్టీర్ మార్గ్‌కు చేరుకోవాలి. ఎర్రగడ్డ, ఎస్ఆర్‌నగర్, పంజాగుట్ట, ఖైరాతాబాద్ వైపు నుంచి నిరాంకారి వద్ద యాత్రలో కలువాలి. ఆసిఫ్‌నగర్ సీతారాంబాగ్, అఘాపురా, గోషమహల్, అలాస్క, మాలకుంట జంక్షన్ నుంచి వచ్చే యాత్ర ఎంజే మార్కెట్ వద్ద ప్రధాన యాత్రలో కలువాలి.



### ఖైరతాబాద్ మహా గణేష్ నిమజ్జనం షెడ్యూల్

- **ఉదయం 7 గంటలకు ప్రారంభంకానున్న శోభాయాత్ర..**
- **మధ్యాహ్నం 1: 30 లోపు నిమజ్జనం పూర్తి**

**బలగం టీవి, హైదరాబాద్**

ఉదయం 7 గంటల నుంచి బడా గణేష్ శోభాయాత్ర ప్రారంభంకానుంది. బడా గణేష్ 40 టన్నుల భారీ వినాయకుడినీ టస్కర్ పైకి ఎక్కించడానికి దాదాపుగా గంట సమయం పడుతుంది. ఆ తరువాత దాదాపుగా రెండు గంటలు వెల్డింగ్ పనులు కొనసాగుతాయి. అనంతరం పూజలు నిర్వహించి ఉదయం 7 గంటలకు శోభాయాత్ర ప్రారంభిస్తారు. ఖైరతాబాద్, సైదాబాద్, ట్యాంక్‌బండ్, ఎన్టీఆర్ మార్గ్ ద్వారా ట్యాంక్‌బండ్‌కు తరలించనున్నారు. క్రేన్ నెంబర్ 4 దగ్గరకు మహాగణపతి రానుంది. సుమారు ఏడు గంటలపాటు నిమజ్జన ఘట్టం కొనసాగనుంది. మధ్యాహ్నం 1:30 లోపు నిమజ్జనం పూర్తి అయ్యేలా పోలీసులు చర్యలు చేపడుతున్నారు.

### నేడు తెలంగాణ తల్లి విగ్రహాలకు
## పాలాభిషేకాలకు బీఆర్ఎస్ పిలుపు

- **తెలంగాణ తల్లిని అవమానపరిచిన రేవంత్‌రెడ్డి వైఖరిని ఖండించాలి**
- **రాజీవ్‌గాంధీ విగ్రహం పెట్టుకుంటే మాకు అభ్యంతరం లేదు**
- **తెలంగాణ తల్లి విగ్రహం పెట్టాల్సిన స్థలంలో రాజీవ్ గాంధీ విగ్రహమేంటీ..?**
- **అధికారంలోకి రాగానే రాజీవ్‌గాంధీ విగ్రహాన్ని గాంధీభవన్‌కు తరలిస్తాం**
- **బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్**

**బలగం టీవి, హైదరాబాద్**

సచివాలయం ముందు తెలంగాణ తల్లి విగ్రహం స్థానంలో రాజీవ్ గాంధీ విగ్రహాన్ని ఆవిష్కరించడానికి వ్యతిరేకంగా మంగళవారం రాష్ట్రవ్యాప్తంగా తెలంగాణ తల్లి విగ్రహాలకు పాలాభిషేకాలు చేయాలని బీఆర్ఎస్ పార్టీ నిర్ణయించింది. మంగళవారం (నేడు) తెలంగాణలోని అన్ని నియోజకవర్గాల్లో తెలంగాణ తల్లి విగ్రహానికి పాలాభిషేకం చేయాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రజలకు పిలుపునిచ్చారు. తెలంగాణ తల్లి కోసం కేటాయించిన స్థానంలో కేవలం రాజకీయ దురుద్దేశంతో రాజీవ్ గాంధీ విగ్రహాన్ని పెట్టి, తెలంగాణ తల్లిని అవమాన పరిచిన రేవంత్ రెడ్డి వైఖరిని ప్రతి ఒక్కరు ఖండించాలన్నారు. తెలంగాణ ప్రజల మనోభావాలను దెబ్బతీసిన కాంగ్రెస్ పార్టీకి, రేవంత్ రెడ్డికి తెలంగాణ ప్రజలు బుద్ధి చెబుతారన్నారు. తెలంగాణ

మిగితా 2వ పేజీలో

# 40 వేల మెగావాట్ల గ్రీన్ పవర్ ఉత్పత్తే లక్ష్యం

- సోలార్ రంగంలో పెట్టుబడులు పెట్టండి
- హైదరాబాద్ లో అవకాశాలు కల్పిస్తాం
- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

బలగం టీవీ, హైదరాబాద్

తెలంగాణ రాష్ట్రం 2035 నాటికి 40 వేల మెగావాట్ల గ్రీన్ పవర్ ఉత్పత్తి చేయాలన్న లక్ష్యంగా ముందుక వెళ్తోందని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క చెప్పారు. ఆయన గుజరాత్ రాజధాని గాంధీనగర్ లోని మహాత్మా మందిర్ కన్వెన్షన్ అండ్ ఎగ్జిబిషన్ సెంటర్ లో నిర్వహించిన గ్రీన్ పవర్ ఎనర్జీ పెట్టుబడిదారుల సమావేశంలో మాట్లాడారు. ప్రధానమంత్రి మోదీ అధ్యక్షతన ఈ సమావేశం జరుగుతోంది. సోలార్ రంగంలో పెట్టుబడులు పెట్టేందుకు ఔత్సాహిక పెట్టుబడి దారులు ముందుకు రావాలని, హైదరాబాద్ లో అన్ని అవకాలనూ కల్పిస్తామని వివరించారు. గ్రీన్ పవర్ ప్రాజెక్టులను ప్రోత్సహించేందుకు సమగ్ర ఇంధన విధానాన్ని అభివృద్ధి చేస్తున్నామని చెప్పారు. పెరుగుతున్న ఇంధన అవసరాలను సమతుల్యం చేయడం స్థిరత్వానికి ఒక నిబద్ధతగా తెలిపారు. తెలంగాణలో రాబోయే ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ సిటీ, ఫోర్త్ సిటీ, మూసి రివర్ ఫ్రంట్ డెవలప్మెంట్ ను ముందుకు తీసుకెళ్లాలని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తుందని తెలిపారు. సమావేశంలో ప్రధాని మోదీతో పాటు ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర, చత్తీస్గడ్, గోవా, రాజస్థాన్ ముఖ్యమంత్రిల తో పాటు కేంద్ర గ్రీన్ పవర్ మంత్రి, తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థల చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్లు ముషారఫ్, వరుణ్ రెడ్డి, డిప్యూటీ సీఎం స్పెషల్ సెక్రటరీ కృష్ణ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.




# విద్యావ్యవస్థపై పట్టింపులేని ప్రభుత్వం





- మాజీమంత్రి హరీశ్‌రావు
- సీఎం రేవంత్‌కు బహిరంగ లేఖ

బలగం టీవీ, హైదరాబాద్

: రాష్ట్రంలోని విద్యావ్యవస్థ, గురుకులాలు, సంక్షేమ వసతి గృహాలు సమస్యలతో సతమతమవుతున్నాయని, వాటన్నింటిని వెంటనే పరిష్కరించాలని మాజీమంత్రి హరీశ్‌రావు కోరారు. ఈ మేరకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి ఆయన బహిరంగ లేఖ రాశారు. దేశ భవిష్యత్తు తరగతి గదిలోనే నిర్మితమవుతుందన్న మాటలకు ప్రాధాన్యత ఇచ్చిన కేసీఆర్, రాష్ట్రంలో విద్యావ్యవస్థ బలోపేతానికి అనేక చర్యలు తీసుకున్నారని ఆయన తెలిపారు. ఇందుకోసం బీఆర్ఎస్ హయాంలో పెద్ద మొత్తంలో నిధులు కేటాయించి ఆరోగ్యకరమైన వాతావరణంలో నాణ్యమైన విద్య అందించినట్లు హరీశ్‌రావు పేర్కొన్నారు. కానీ, తొమ్మిది నెలల కాంగ్రెస్ పాలన వల్ల ప్రభుత్వ విద్యావ్యవస్థ పతనావస్థకు చేరుకొందని, పురుగులు లేని భోజనం, పాము కాట్లు, ఎలుక కాట్లు లేని వసతి కోసం తరగతి గదుల్లో ఉండాల్సిన విద్యార్థులు రోడ్లెక్కి నిరసనలు తెలుపుతున్నారని ఆక్షేపించారు. ఒకవైపు టీచర్లు లేని కారణంగా పాఠశాలలు మూతపడుతుంటే మరోవైపు విశ్వాసం సన్నగిల్లడంతో డ్రాపౌట్స్ పెరిగిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఈ విద్యా సంవత్సరంలో ఒక్క విద్యార్థి లేని పాఠశాలలు 1864 ఉన్నాయని, 30లోపు విద్యార్థులున్న పాఠశాలలు 9,447 ఉన్నాయని, వందలోపు విద్యార్థులు మాత్రమే ఉన్న పాఠశాలలు 9,609 అని మాజీమంత్రి హరీశ్?రావు లేఖలో వివరించారు. తొమ్మిది నెలల కాంగ్రెస్ పాలనలో మొత్తం 26,287 ప్రభుత్వ పాఠశాలలకు దాదాపు 20 వేల పాఠశాలల పరిస్థితి అగమ్యగోచరంగా తయారైందని ఆరోపించారు. ఇక గురుకులాల పరిస్థితి మరింత అధ్వాన్నంగా మారిందని, కేసీఆర్ పాలనలో ఎవరెస్ట్ శిఖరమంత ఖ్యాతి గడించిన గురుకులాలు సమస్యలకు నిలయాలుగా మారాయని మాజీమంత్రి మండిపడ్డారు.

గురుకులాల దుస్థితి గురించి కాంగ్రెస్ ప్రభుత్వానికి పట్టింపులేదని సంక్షేమ హాస్టళ్లను, సంక్షోభ హాస్టళ్లుగా మార్చిందన్నారు. ఈ విద్యాసంవత్సరంలో ఇప్పటి వరకు 715 మందికి పైగా విద్యార్థులు ఆస్పత్రుల పాలు కాగా, 40 పైగా మంది ప్రాణాలు కోల్పోయారని హరీశ్‌రావు తెలిపారు. ఇది అత్యంత బాధాకరమైన విషయమని ఆవేదన వ్యక్తం చేశారు. ఇంత జరుగుతున్నా ప్రభుత్వం పట్టించుకోక పోవడం శోచనీయమన్నారు. ప్రభుత్వ పాఠశాలలు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ గురుకుల సంక్షేమ హాస్టళ్లలో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

# హైదరాబాద్‌ను ప్రపంచ ఫార్మా కంపెనీల క్యాపిటల్‌గా తీర్చిదిద్దుతాం



- పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు

బలగం టీవీ, హైదరాబాద్

హైదరాబాద్ బ్రాండ్‌ను ప్రపంచంలోనే ఫార్మా కంపెనీల క్యాపిటల్‌గా తీర్చిదిద్దుతామని పరిశ్రమలు, ఐటీ శాఖ మంత్రి శ్రీధర్ బాబు అన్నారు. సోమవారం జీనోమ్ వ్యాలీలో ఫార్మా పరిశ్రమల ప్రతినిధులతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ హైదరాబాద్ ఇమేజ్ అభివృద్ధికి గడిచిన 30, 40 సంవత్సరాలుగా కృషి చేస్తున్న ఫార్మా పరిశ్రమలకు మరింతగా ప్రోత్సాహం, సకల వసతులను కల్పిస్తూ మరిన్ని పెట్టుబడులు వచ్చే విధంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో కృషి చేస్తున్నామని తెలిపారు.

త్వరలో హైదరాబాద్‌లో ప్రముఖ ఫార్మా పరిశ్రమలైన లారస్ ల్యాబ్స్, కర్క ల్యాబ్స్ జాయింట్ వెంచర్‌గా సుమారు 300 ఎకరాల్లో రూ,2 వేల కోట్లతో పరిశ్రమలు ఏర్పాటు చేసేందుకు ముందుకు వచ్చినట్లు తెలిపారు. వీటి ద్వారా వందలాది మందికి ఉపాధి అవకాశాలు లభించనున్నట్లు ఆయన తెలిపారు. ప్రపంచ ఫార్మా దృష్టిని మళ్లీంచడానికి జీనోమ్ వ్యాలీకి ఆకర్షించేందుకు అత్యంత ప్రపంచ స్థాయి ప్రమాణాలతో వివిధ దశలలో తీర్చిదిద్దుతున్నామని మంత్రి స్పష్టం చేశారు. హైదరాబాద్‌ను ఫార్మా రంగంలో పెట్టుబడులకు స్వర్గధామంలా తయారు చేసి ఉపాధి అవకాశాలు, రాష్ట్ర అభివృద్ధి ధ్యేయంగా పనిచేస్తున్నామని మంత్రి శ్రీధర్‌బాబు తెలిపారు. అందుకే ఇవాళ జీనోమ్ వ్యాలీలోని వివిధ ఫార్మా కంపెనీల దిగ్గజాలతో మరిన్ని పెట్టుబడులు రాబట్టే విషయమై చర్చించినట్లు ఆయన తెలిపారు. ఈ సమావేశంలో టీజీఐఐసీ చైర్మన్ నిర్మలా జయప్రకాశ్ రెడ్డి, ఎండీ విష్ణువర్ధన్ రెడ్డి, జిల్లా కలెక్టర్ గౌతమ్ పోట్రు, ఆయా ఫార్మా కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు.

# నిమజ్జనాలకు అంతా రెడీ

(మొదటి పేజీ తరువాయి)

ఆర్టీసి బస్సులకు ఆంక్షలు ఉన్నాయని అధికారులు వెల్లడించారు. మెహదీపట్నం నుంచి వచ్చే బస్సులను మాసబ్ ట్యాంక్ వద్ద నిలిపివేస్తారు. కూకట్‌పల్లి నుంచి వచ్చే బస్సులు ఖైరతాబాద్ వద్ద, సికింద్రాబాద్ నుంచి వచ్చే బస్సులు సీటీఓ ప్లాజా, ఎస్‌బీహెచ్, క్లాక్ టవర్, చిలకలగూడ క్రాస్ రోడ్ వరకు మాత్రమే పోలీసులు అనుమతి ఇస్తారు. గడ్డి అన్నారం, చాదర్ఘాట్ వైపు వచ్చే వాహనాలు దిల్?సుఖ్?నగర్ వద్ద, మిధాని, ఇబ్రహీంపట్నం వైపు నుంచి వచ్చే వాహనాలు ఐఎస్ సదన్ వద్ద, ఇంటర్ సిటీ స్పెషల్ బస్సులు వైపీఎంఎ నారాయణ గూడ వద్ద నిలిపివేస్తామని పోలీసులు వివరించారు.

ఎంజీబీఎస్ నుంచి అంతరాష్ట్రతోపాటు వివిధ జిల్లాలకు వెళ్లే బస్సులకు కోసం ప్రత్యేక రూట్ మ్యాప్?ను ఏర్పాటు చేశామని అధికారులు వెల్లడించారు. రాజీవ్ రహదారి నుంచి వచ్చే వాహనాలను జేబీఎస్, సంగీత్, తార్నాక, విద్యానగర్ టీ జంక్షన్, ఫివర్ ఆస్పత్రి, బర్కత్ పూర్, నింబోలి అడ్డా మీదుగా ఎంజీబీఎస్‌కు వెళ్లాలని పోలీసులు సూచించారు. బెంగళూరు వైపు నుంచి వచ్చే వాహనాలతోపాటు ముంబై ఎన్‌హెచ్ 9 నుంచి వచ్చే వాహనాలు వై జంక్షన్

బోయిన్‌పల్లి వైసీఎంఎ సంగీత్, తార్నాక, విద్యానగర్ టీ జంక్షన్, ఫివర్ ఆస్పత్రి, బర్కత్‌పూర్ నింబోలి అడ్డా మీదుగా ఎంజీబీఎస్ వెళ్లాలని ట్రాఫిక్ పోలీసులు కోరారు.

జీహెచ్‌ఎంసీ పరిధిలో గణేష్ నిమజ్జనానికి ఏర్పాట్లు పూర్తయ్యాయి. బందోబస్తు విధుల్లో 25 వేల మంది పోలీసులు పాల్గొంటున్నారు. కేవలం హుస్సేన్ సాగర్ చుట్టూ 3 వేల మందితో బందోబస్తు ఏర్పాట్లు చేశారు. ఈ ఏడాది హుస్సేన్ సాగర్‌లో 25 వేల నుంచి 30 వేల విగ్రహాలు నిమజ్జనం అవుతాయని అధికారులు అంచనా వేస్తున్నారు. హుస్సేన్ సాగర్ పరిసర ప్రాంతాల్లోనే 12 షీటీమ్స్ పహారా కాయనున్నాయి.

మరోవైపు నిమజ్జనాన్ని వీక్షించేందుకు వచ్చే ప్రజలు పబ్లిక్ ట్రాన్స్‌పోర్టు వినియోగిస్తే నిమజ్జనం ప్రశాంతంగా వీక్షించవచ్చని అధికారులు తెలిపారు. ఎలాంటి అసౌర్యం కలగుండా అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించారు. నిమజ్జనం వచ్చే వారు, వీక్షించేందు వచ్చే ప్రజలు ఎలాంటి అత్యవసర సమయాల్లో ట్రాఫిక్ హెల్ప్ లైన్ నంబర్లు 9010203626, 8712660600, 040-27852482కి ఫోన్ చేయొచ్చని పోలీసులు తెలిపారు.

హైదరాబాద్ నగరంలో మొత్తం 25 వేల మంది పోలీసులు పహారా కాస్తున్నట్లు సీపీ సీవీ ఆనంద్ తెలిపారు. ఇందులో 3వేలమందిని హుస్సేన్‌సాగర్ పరిసరాల్లో మోహరించినట్లు పేర్కొన్నారు. మరోవైపు.. మహిళల భద్రతకు 12 షీటీమ్స్ బృందాలను రంగంలోకి దించారు. ఇక మంగళవారం ఉదయం 6 గంటల నుంచి బుధవారం రాత్రి 11 గంటల వరకు భారీ వాహనాలను, ప్రైవేటు ట్రావెల్స్ బస్సులను హైదరాబాద్ నగరంలోకి అనుమతించేది లేదని అధికారులు వెల్లడించారు. నగరంలో మొత్తం 67 డైవర్షన్ పాయింట్లను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. అత్యవసర సమయాల్లో ట్రాఫిక్ హెల్ప్ లైన్ కోసం 9010203626, 8712660600, 040-27852482 నంబర్లకు ఫోన్ చేయవచ్చని తెలిపారు.



## గణేష్ నిమజ్జనం కోసం ఏర్పాట్లు పూర్తి : మంత్రి పొన్నం ప్రభాకర్

హైదరాబాద్ జంట నగరాలకు సంబంధించి గణేష్ నిమజ్జనం కోసం ఏర్పాట్లు పూర్తి చేశామని మంత్రి పొన్నం ప్రభాకర్ వెల్లడించారు. సోమవారం ఖైరతాబాద్ మహాగణపతిని మంత్రి దర్శించుకున్నారు. మహాగణపతి నిమజ్జనం కోసం జరుగుతున్న ఏర్పాట్లు పొన్నం పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. మొదటిసారి మండపాలకు ఉచిత విద్యుత్ ఇచ్చామని తెలిపారు. శాంతియుతంగా భక్తి శ్రద్ధలతో నిర్వాహకులు పూజ కార్యక్రమాలు చేశారన్నారు. రేపు నిమజ్జన ఘట్టమని.. భక్తులు శాంతియుతంగా జరుపుకోవాలని సూచించారు. 360 క్రేన్లు హైదరాబాద్ మొత్తం ఏర్పాటు చేశామని తెలిపారు. మొబైల్ క్రేన్లు కూడా ఉన్నాయన్నారు. అవసరమైన ప్రాంతాలకు తరలించదానికి ప్రత్యేక అధికారులు ఉన్నారని చెప్పారు. ఎక్కడైనా ఏమైనా ఇబ్బంది వస్తే అధికారుల దృష్టికి తీసుకురావాలని తెలిపారు. రేపు (మంగళవారం) ఉదయం ఖైరతాబాద్ వినాయకుడి శోభాయాత్ర ప్రారంభం అవుతుందని.. ఇప్పటికే పనులు జరుగుతున్నాయన్నారు. సమయానికి నిమజ్జనం పూర్తి చేయడానికి అందరూ సహకరించాలని కోరారు. ఎల్లుండి వర్కింగ్ డే అని ఆలోపు నిమజ్జనం పూర్తి చేసుకుంటే ప్రజలకు ఇబ్బందులు ఉండవని మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు.

## కలర్ పేపర్లు, పూలు రోడ్లపై వేయవద్దు : జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఆమ్రపాలి కాట

హైదరాబాద్ మహానగర పరిధిలో గణేష్ నిమజ్జనానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఆమ్రపాలి కాట తెలిపారు. సోమవారం హైదరాబాద్ నెక్లెస్ రోడ్డులో గణేష్ నిమజ్జన ఏర్పాట్లను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ గణేష్ నిమజ్జనానికి శానిటేషన్, ఇంజినీరింగ్, యూబీడీ, యూసీడీ విభాగాలను చెందిన సిబ్బందితో కలిపి మొత్తం 15 వేల మంది మూడు షిఫ్ట్ లలో 24 గంటల పాటు భక్తులకు సేవలందిస్తారని తెలిపారు. నిమజ్జనం సందర్భంగా మంగళవారం నుంచి 3 రోజుల పాటు 15 వేల మంది జీహెచ్‌ఎంసీ సిబ్బంది.. 3 షిఫ్టుల్లో పనిచేయనున్నట్లు వెల్లడించారు. జీహెచ్‌ఎంసీ పరిధిలో 465 క్రేన్లు, హుస్సేన్‌సాగర్ వద్ద 38 క్రేన్లు ఏర్పాటు చేశామని చెప్పారు. ఇక నిమజ్జనం సందర్భంగా.. విగ్రహాల శోభాయాత్రలో కలర్ పేపర్లు, పూలు, చెత్త రోడ్లపై వేయవద్దని ఆమ్రపాలి విజ్ఞప్తి చేశారు. రోడ్లపై కలర్ పేపర్లు, చెత్త వేయడం వల్ల జీహెచ్‌ఎంసీ పారిశుద్ధ్య సిబ్బందికి తీవ్ర ఇబ్బందులు ఏర్పడతాయని.. అందరూ సహకరించాలని ఆమ్రపాలి కోరారు. డిప్యూటీ కమిషనర్లు, ఇంజనీరింగ్, విద్యుత్, యుబిడీ, స్థానిక పోలీస్, ఉత్సవ కమిటీ సభ్యులతో కమిటీలు వేసి ఊరేగింపునకు సమస్యలు రాకుండా చర్యలు తీసుకున్నామని అన్నారు. ప్రశాంత వాతావరణంలో నిమజ్జనం జరుపుకోవాలని భక్తులను కోరారు.

# విప్లవాత్మకమైన మార్పులు తీసుకొచ్చిన రాజీవ్ గాంధీ



(మొదటి పేజీ తరువాయి)

భూ పరిమితి చట్టం తెచ్చి జాగీర్దార్లు, జమిందార్ల భూములు పేదలకు పంచిన ఘనత ఇందిరా గాంధీ గారిదని గుర్తు చేశారు. నిరుపేదల సొంతింటి కలను నెరవేర్చడమే కాకుండా లంబాడాలను ఎస్టీలలో చేర్చింది ఇందిరా గాంధీ అని చెప్పారు.

ప్రత్యేక రాష్ట్రం ఏర్పడి దశాబ్దకాలం దాటుతున్నా తెలంగాణ తల్లి విగ్రహం ఏర్పాటు చేయలేకపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణ ఆవిర్భావ ప్రకటన వెలువడిన నాటి గుర్తుగా డిసెంబర్ 9 న సచివాలయ ప్రాంగణ ప్రధాన ద్వారం ముందు వీరనారి తెలంగాణ తల్లి విగ్రహాన్ని ప్రతిష్టిస్తామని చెప్పా

**రాజీవ్ విగ్రహాన్ని ఎవరు తొలగిస్తారో చూస్తాం: సీఎం రేవంత్ రెడ్డి**

తాము ఏర్పాటు చేసిన రాజీవ్‌గాంధీ విగ్రహాన్ని ఎవరు తొలగిస్తారో చూస్తామని సీఎం రేవంత్ అన్నారు. డిసెంబర్ 9న సచివాలయంలో తెలంగాణ తల్లి విగ్రహాన్ని పెడతామన్నారు. సొంత విగ్రహం పెట్టుకుందామనే ఇక్కడ స్థలం ఖాళీగా ఉంచుకున్నారని ఆరోపించారు. తెలంగాణ కోసం బీఆర్ఎస్ నేతలు చేసిన త్యాగాలు ఏంటని ప్రశ్నించారు. బీఆర్ఎస్ ఏర్పాటుకు స్థలాన్ని ఇచ్చిన కొండా లక్ష్మణ్ బాపూజీ చనిపోతే కేసీఆర్ కుటుంబం ఒక్కరు కూడా హాజరు కాలేదన్నారు. కొంతమంది మిడతల దండును ప్రజల మీదకు ఉసి గొల్పుతున్నారని.. కాంగ్రెస్ కార్యకర్తలు తరిమికొట్టాలంటూ పిలుపునిచ్చారు.

ఐదేళ్లు మహిళకు మంత్రి వర్గంలో చోటు ఇవ్వని వారికి మహిళా అభివృద్ధి గురించి ఏం తెలుస్తోందన్నారు. రాజీవ్ గాంధీ తెచ్చిన కంప్యూటర్ పరిజ్ఞానంతోనే కేటీఆర్ అమెరికా వెళ్లి జాబ్ చేశారని.. ఐటి మంత్రి అయ్యారంటూ పేర్కొన్నారు. త్యాగాలు అంటే నెహ్రూ, ఇందిరమ్మ, రాజీవ్ కుటుంబానిదేనన్నారు. తెలంగాణ ఇచ్చింది మేము.. తెలంగాణ తెచ్చింది మేము.. సెక్రటేరియట్‌లో తెలంగాణ తల్లి విగ్రహం పెట్టేది మేము.. అంటూ రేవంత్ రెడ్డి పేర్కొన్నారు.

ఫామ్‌హౌస్‌లు కట్టుకోవటానికి, రూ.లక్ష కోట్లు మింగి కాళేశ్వరం నిర్మించటానికి ఉన్న సమయం, తెలంగాణ తల్లి విగ్రహం పెట్టడానికి మాత్రం కేసీఆర్‌కు తీరిక లేదా అని నిలదీశారు. కేసీఆర్ విగ్రహం పెట్టుకోవడానికి ఇక్కడ స్థలం ఉంచుకున్నారని ఎద్దేవా చేశారు. రాజీవ్ విగ్రహాన్ని ఎవరు తొలగిస్తారో రండి చూసుకుందామన్న సీఎం, దమ్ముంటే రాజీవ్‌గాంధీ విగ్రహాన్ని తొలగించే టైమ్ చెప్పాలని సవాల్? విసిరారు.

త్యాగం అంటే ఏంటో ప్రజలకు తెలియజేయాల్సిన బాధ్యత తనపై ఉందన్నారు. రూ.వేల కోట్ల సంపదను దేశం కోసం త్యాగం చేసిన నాయకుడు, స్వాతంత్ర్యం కోసం జైలుకు వెళ్లిన వ్యక్తి, స్వాతంత్ర్యం తర్వాత దేశాన్ని ఐక్యంగా ఉంచిన నేత నెహ్రూ అని కొనియాడారు. ఆయన కట్టిన ప్రాజెక్టులు ఇప్పటికీ ఆయన పనితనానికి సజీవ సాక్ష్యాలుగా ఉన్నాయని గుర్తు చేశారు. నెహ్రూ అధికారంలో ఉన్నప్పుడు ఇందిరా గాంధీ ఏ బాధ్యత తీసుకోలేదన్న సీఎం, కొందరు మాత్రం తండ్రి అధికారాన్ని అడ్డం పెట్టుకొని మంత్రి పదవులు పొందుతున్నారని పరోక్షంగా విపక్షాలను విమర్శించారు.

బ్యాంకులను ప్రభుత్వ పరం చేసి పేదలకు ఇందిరా గాంధీ మంచి చేశారని, లక్షల ఎకరాల భూములను పేదలకు పంచి పెట్టింది ఇందిరా గాంధీ కాదా అని ప్రశ్నించారు. దేశంలో రిజర్వేషన్లు తెచ్చింది కాంగ్రెస్ పార్టీ కాదా అని అన్నారు.

## నేడు తెలంగాణ తల్లి విగ్రహాలకు

# పాలాభిషేకాలకు బీఆర్ఎస్ పిలుపు



(మొదటి పేజీ తరువాయి)

అస్తిత్వంతో పెట్టుకున్నోళ్లెవరూ రాజకీయాల్లో బతికి బట్టకట్టలేరన్న విషయం రేవంత్ రెడ్డి గుర్తుంచుకోవాలని బీఆర్ఎస్ పార్టీ పేర్కొంది.

రాజీవ్ గాంధీ విగ్రహాన్ని పెట్టుకోవాలని కాంగ్రెస్ ప్రభుత్వం అనుకుంటే తమకు ఎలాంటి అభ్యంతరం లేదని అయితే, తెలంగాణ తల్లి విగ్రహం పెట్టాల్సిన స్థలంలో రాజీవ్ గాంధీ విగ్రహాన్ని ఏర్పాటు చేయడాన్ని తాము వ్యతిరేకిస్తున్నట్లు కేటీఆర్ తెలిపారు. సచివాలయం, అమరజ్యోతి మధ్యలో తెలంగాణ తల్లి విగ్రహం ఉండాలని కేసీఆర్ 2023 జులైలోనే స్థలాన్ని ఎంపిక చేశారని ఆయన గుర్తు చేశారు. కానీ, కాంగ్రెస్ ప్రభుత్వం కుసంస్కారంతో తెలంగాణ ఉద్యమానికి సంబంధం లేని వ్యక్తి విగ్రహాన్ని ఆ స్థలంలో ఏర్పాటు చేసిందని పేర్కొన్నారు.

ప్రతి తెలంగాణ వ్యక్తి మనసును గాయపర్చేలా కాంగ్రెస్ ప్రభుత్వ చర్య ఉందని కేటీఆర్ ఆక్షేపించారు. తాము అధికారంలోకి వచ్చిన వెంటనే సచివాలయం ముందు నుంచి రాజీవ్ గాంధీ విగ్రహాన్ని తొలగిస్తామని ఆయన స్పష్టం చేశారు. సకల మర్యాదలతో రాజీవ్ గాంధీ విగ్రహాన్ని గాంధీ భవన్‌కు తరలిస్తామని మరోమారు ప్రకటించారు. ఎట్టి పరిస్థితుల్లో తాము గతంలో ప్రతిపాదించిన స్థలంలోనే తెలంగాణ తల్లి విగ్రహం ఉండేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు.

కాంగ్రెస్ అధికారంలోకి వస్తే తెలంగాణ ఆత్మగౌరవాన్ని తాకట్టు పెట్టి ఢిల్లీకి బానిసత్వం చేస్తారని తాము ముందునుంచే చెప్పామని, రేవంత్‌రెడ్డి సరిగ్గా ఇప్పుడు అదే చేస్తున్నారని కేటీఆర్ వ్యాఖ్యానించారు. కేవలం ఢిల్లీ బాసుల మెప్పు కోసమే తెలంగాణను, ఆత్మను తాకట్టు పెడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణ ప్రజలు, తెలంగాణ మనోభావాల కన్నా కూడా కాంగ్రెస్ పార్టీ నాయకులకు దిల్లీ బాసుల మెప్పు పొందటమే ముఖ్యమైపోయిందని దుయ్యబట్టారు.

# విమోచన దినోత్సవం పేరుతో ఉత్సవాలు నిర్వహించాలి

- హైదరాబాద్‌లో సర్దార్ వల్లభాయి పటేల్ విగ్రహాన్ని ఏర్పాటు చేస్తాం
- కేంద్ర మంత్రి బండిసంజయ్

బలగం టీవీ, హైదరాబాద్

తెలంగాణ ప్రజాపాలన దేనికోసం, ఎవరికి భయపడి తెలంగాణ విమోచన దినోత్సవం పేరుతో అధికారికంగా ఉత్సవాలు నిర్వహించడం లేదని కేంద్ర హెూంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ ప్రశ్నించారు. పేరు మార్చి తెలంగాణ చరిత్రనే కనుమరుగు చేస్తున్నారని, నిజాంపై పోరాడి ప్రాణాలర్పించిన వారి త్యాగాలను అవమానిస్తున్నారని పేర్కొన్నారు. అందుకే తెలంగాణ ప్రజాపాలన దినోత్సవ కార్యక్రమానికి తాను హాజరు కావడం లేదన్నారు.

కాంగ్రెస్‌కు చేతనైతే తెలంగాణ విమోచన దినోత్సవం పేరుతో ఉత్సవాలు నిర్వహిస్తే తప్పకుండా తానే హాజరవుతానన్నారు. వారికి చేతకాకుంటే కేంద్రం పరేడ్ గ్రౌండ్‌లో అధికారికంగా నిర్వహిస్తున్న తెలంగాణ విమోచన దినోత్సవానికి హాజరు కావాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి వస్తే హైదరాబాద్‌లో సర్దార్ వల్లభాయి పటేల్ విగ్రహాన్ని ఏర్పాటు చేస్తామన్నారు.

సచివాలయం వద్ద రాజీవ్ గాంధీ విగ్రహం ఏర్పాటు కాంగ్రెస్ రాజకీయ డ్రామాలకు నిదర్శనమని ఆరోపించారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలు రెండూ ఒకటేనని లోపాయికారీ ఒప్పందాలతోనే కాలం వెల్లదీస్తున్నాయని ఆరోపించారు. కావాలనే హైడ్రా, విగ్రహాల పేరిట రోజుకో లొల్లి పెట్టుకొని, ఆరు గ్యారంటీలను పక్కదారి పట్టిస్తున్నారని మండిపడ్డారు. కేజ్రీవాల్ సీఎం పదవికి రాజీనామా చేయడంపై ఇక్కడ కేసీఆర్ కుటుంబం ఖాళీగానే ఉంది కదా, ఆయన కుటుంబంలో ఎవరికో ఒకరికి ఆ పదవి ఇస్తారేమో అని వ్యంగ్యంగా వ్యాఖ్యానించారు. లిక్కర్ స్కాం కేసులో ఇరు కుటుంబాలకు మంచి సాన్నిహిత్యం ఉందని ఎద్దేవా చేశారు.

# చెట్లు నరికినా పట్టింపేది..

- రోడ్డుపై చెట్లను నరికితే జరిమానాలు...
- పల్లె ప్రకృతి వనములో నరికితే చర్యలేవి..
- చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్న ప్రజలు..








**బలగం టీవీ, ఎల్లారెడ్డిపేట:**
రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని గిద్దే చెరువు పక్కన గల పల్లె ప్రకృతి వనంలో చెట్లను నరుకుతున్నారు. మండల కేంద్రంలో రోడ్డుకు ఇరువైపులా రాష్ట్ర ప్రభుత్వం చెట్లను పెడితే ఇంటికి అడ్డంగా ఉన్నాయని చెట్ల కొమ్మలు నరికిన వారికి గ్రామపంచాయతీ సిబ్బంది వేల రూపాయలు జరిమానాలు విధిస్తున్నారు.

పల్లె ప్రకృతి వనం ఆహ్లాదకరంగా ఉండేందుకు గత ఐదు సంవత్సరాల క్రితం రాష్ట్ర ప్రభుత్వం పల్లె ప్రకృతి వనంలో మొక్కలు పెట్టింది. లక్షలు వెచ్చించి పల్లె ప్రకృతి వనంలో మొక్కలు పెడితే పెరిగి పెద్దగయ్యాయి. సోమవారం ఉదయం కొందరు గుర్తుతెలియని వ్యక్తులు చెట్లను నరికి పల్లె ప్రకృతి వనం ఫినిషింగ్ కంచె బయట వేశారు. అటుగా వెళ్లిన గ్రామ ప్రజలు.. పల్లె ప్రకృతి వనంలో ఉన్న చెట్లను నరికి ఫినిషింగ్ బయట వేయడం ఏంటని ప్రశ్నిస్తున్నారు. రోడ్డుకు ఇరువైపులా ఉన్న చెట్లను నరికితే వేల రూపాయలలో గ్రామపంచాయతీ సిబ్బంది జరిమానాలు విధిస్తున్నారని పల్లె ప్రకృతి వనంలో చెట్లను నరికిన వారికి భారీ మొత్తంలో జరిమానాలు విధించాలని పల్లె ప్రకృతి వనంలోకి వచ్చే ప్రజలు కోరుతున్నారు. పల్లె ప్రకృతి వనంలో పనిచేస్తున్న సిబ్బందికి తెలిసి చెట్లను నరికారా లేక తెలియక నరికారా అనేది అధికారులు దర్యాప్తు చేపట్టి చెట్లను నరికిన వారికి భారీ మొత్తంలో జరిమానాలు విధించాలని కోరుతున్నారు. పల్లె ప్రకృతి వనం పూర్తిగా అసాంఘిక కార్యకలాపాలకు అడ్డగా మారిందని ప్రజలు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు వెంటనే స్పందించి చెట్లను నరికి కట్టెలను పల్లె ప్రకృతి వనం ఫెన్సింగ్ బయట వేసిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. అధికారులు ఎలా స్పందిస్తారో వేచి చూడాలి.



## భక్తిశ్రద్ధలతో నిమజ్జనం వైభవంగా చేపట్టాలి

- నిర్ణీత సమయానికి విగ్రహాలను తరలించాలి.
- కలెక్టర్ సందీప్ కుమార్ ఝా, ఎస్పీ అఖిల్ మహాజన్..

**బలగం టీవీ ,రాజన్న సిరిసిల్ల**
వినాయక మండపాల నిర్వాహకులు నిర్ణీత సమయానికి విగ్రహాలను తరలించాలని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా, ఎస్పీ అఖిల్ మహాజన్ సూచించారు. మంగళవారం వినాయక విగ్రహాల నిమజ్జనానికి సిరిసిల్లలోని మానేరు తీరంలో చేస్తున్న ఏర్పాట్లను కలెక్టర్, ఎస్పీ పలు శాఖల అధికారులతో కలిసి సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వినాయక మండపాల నిర్వాహకులు తమ విగ్రహాలను భక్తిశ్రద్ధల మధ్య వేడుకలు నిర్వహిస్తూ వైభవంగా తరలించాలని సూచించారు. ప్రజా ప్రతినిధులు, యువత ప్రతి ఒక్కరూ సహకరించాలని,అధికారులు సూచించిన మేరకు సౌండ్ బాక్స్‌లు పెట్టుకోవాలని ఆదేశించారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో ముందుకు వెళ్ళి, వేడుకలను విజయవంతం చేయాలని పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమం లో సిరిసిల్ల డీఎస్పీ చంద్రశేఖర్ రెడ్డి, సిరిసిల్ల మున్సిపల్ కమిషనర్ మీర్జా ఫసహత్ అలీ బేగ్, ఆయా శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజాపాలనలో ప్రజా సమస్యలకు తావు లేదు

**బలగం టీవీ ,తంగళ్ళపల్లి**
రాజన్న సిరిసిల్ల జిల్లా తంగళ్ళపల్లి మండలంలోని కేసీఆర్ నగర్ కాలనీలోని ప్రజలకు ఉన్నటువంటి ఇబ్బందులను తెలుసుకున్న కాంగ్రెస్ సిరిసిల్ల నియోజకవర్గం ఇన్‌చార్జి కేకే మహేందర్ రెడ్డి కార్యకర్తలతో సహా ప్రజల వద్దకు వెళ్లి ప్రజలతో సమస్యలు ఒక్కొక్కటిగా తెలుసుకొని హెల్త్ సెంటర్,వాటర్ సమస్య, డ్రైనేజీ సమస్య,వీధి దీపాలు వేయడం వంటి మౌలిక సదుపాయాల గురించి తెలుసుకొని సంబంధిత అధికారులకు తెలియజేశారు. అధికారులు త్వరలో సమస్యను పరిష్కరిస్తామన్నారు. కాంగ్రెస్ మండల అధ్యక్షులు జలగం ప్రవీణ్ తో పాటు కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.



## జానీ మాస్టర్‌పై లైంగికదాడి కేసు

**బలగం టీవీ, హైదరాబాద్**
కొరియోగ్రాఫర్, జనసేన నేత జానీ మాస్టర్‌పై లైంగికదాడి కేసు నమోదు అయింది. గత కొంతకాలంగా తన మీద లైంగిక వేదింపులకు పాల్పడుతున్నాడని జానీ దగ్గర పని చేసే ఓ మహిళా కొరియోగ్రాఫర్ రాయదుర్గం పోలీసులకు ఫిర్యాదు చేసింది. మహిళ ఫిర్యాదు మేరకు రాయదుర్గం పోలీసులు జీరో ఎఫ్ఐఆర్‌ను నమోదు చేసి తదుపరి విచారణ కోసం నార్సింగి పోలీసులకు కేసు బదిలీ చేశారు. అవుట్‌డోర్ షూటింగ్ కోసం చెన్నై, ముంబై, హైదరాబాద్‌తో సహా వివిధ నగరాలకు వెళ్ళినప్పుడు తనపై అనేకసార్లు లైంగిక వేధింపులకు పాల్పడ్డాడని సదరు మహిళ ఫిర్యాదులో పేర్కొన్నారు. హైదరాబాద్ నార్సింగిలోని తన నివాసంలో కూడా జానీ మాస్టర్ తనపై అనేకసార్లు లైంగిక వేధింపులకు పాల్పడ్డాడని పేర్కొన్నారు. దీంతో ఆయనపై ఐపిసి సెక్షన్ 376 (రేప్), క్రిమినల్ బెదిరింపు (506), 323 (2) సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. ఇక లైంగిక వేధింపుల ఆరోపణల క్రమంలో జానీ మాస్టర్‌పై జనసేన యాక్షన్ తీసుకుంది పార్టీ కార్యక్రమాలకు దూరంగా

## మౌలిక సౌకర్యాలు కల్పించాలి



- కలెక్టర్ సందీప్ కుమార్ ఝా

**బలగం టీవీ ,తంగళ్లపల్లి**
తంగళ్లపల్లి మండలంలోని కేసీఆర్ కాలనీలో కావాల్సిన సౌకర్యాలు కల్పించాలని అధికారులను కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ఆదేశించారు. కాలనీని కలెక్టర్ సోమవారం ఉదయం పరిశీలించారు. ఈ సందర్భంగా కాలనీ వాసులతో మాట్లాడి, వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. స్మశాన వాటిక కోసం స్థలాన్ని గుర్తించాలని,నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని తహసీల్దార్ జయంత్‌ను ఆదేశించారు. ఇందులో మున్సిపల్ కమిషనర్ మీర్జా ఫసహత్ అలీ బేగ్ తదితరులు పాల్గొన్నారు.

## బాణసంచా తయారీ కేంద్రంలో పేలుడు



- ఏడుగురికి తీవ్ర గాయాలు,
- ఒకరి పరిస్థితి విషమం

**బలగం టీవీ, అమరావతి**
డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా అమలాపురంలోని రావులచెరువు సమీపంలో బాణ సంచా తయారు చేస్తున్న ఇంట్లో సోమవారం భారీ పేలుడు సంభవించింది. ఈ ఘటనలో ఏడుగురు తీవ్రంగా గాయపడ్డారు. వీరిలో ఒకరి పరిస్థితి విషమంగా ఉంది. పేలుడు ధాటికి భవనం పూర్తిగా నేలమట్టమైంది.

స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. దీపావళి నేపథ్యంలో రావులచెరువు సమీపంలో కొవ్వాల నాగేశ్వరరావు కుటుంబం రహస్యంగా బాణసంచాను తయారు చేస్తోంది. సోమవారం ఎప్పటిలాగే బాణసంచా పనిలో నిమగమయ్యారు. ఆ సమయంలో ఇంట్లో కొవ్వాల నాగేశ్వరరావుతో పాటూ ఆయన భార్య కొవ్వాల నాగలక్ష్మి, కుమారుడు కొవ్వల రాజు, కుమార్తె కట్టా వేణు, మనువడు కట్టా వెంకట్, మనువరాలు మోహనప్రియ, స్థానికుడు చొల్లంగి సుబ్రహ్మణ్యం ఉన్నారు. ప్రమాదవశాత్తు నిప్పు రవ్వలు పటాస్ పౌడర్‌లో పడటంతో నిప్పంటుకుంది. గమనించిన వారు వెంటనే బయటకు పరుగులు తీస్తుండగానే పెద్ద శబ్దంతో పేలుడు సంభవించింది. ఇంట్లో ఉన్న రెండు గ్యాస్ సిలిండర్లు సైతం పేలడంతో భవనం కుప్పకూలింది. ఈ ప్రమాదంలో ఏడుగురూ తీవ్రంగా గాయపడ్డారు. పేలుడు తీవ్రతకు ఇంట్లో ఉన్న బైకులు పదిమీటర్ల దూరంలో ఎగిరిపడ్డాయి. పక్కనే ఉన్న రెండు భవనాలు కూడా దెబ్బతిన్నాయి. గాయపడ్డవారిని అమలాపురం ఏరియా, కిమ్స్ ఆస్పత్రులకు తరలించారు. వీరిలో ఒకరి పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు తెలిపారు. పట్టణ సిఐ వీరబాబు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. చికిత్స పొందుతున్న బాధితులను ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు, సీపీఐ(ఎం) డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా కన్వీనర్ కారెం వెంకటేశ్వరావు పరామర్శించారు. ఈ ప్రమాదానికి కారణాలు తెలిసిరాలేదు. నాగేశ్వరరావుకు చుట్టకాల్చే అలవాటు ఉందని, ఆ నిప్పురవ్వలు పడి ప్రమాదం సంభవించిందా? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కూడా కారణమై ఉండొచ్చని, మెగ్నీషియం, పొటాష్ రాపిడి వల్ల కూడా మంటలు వ్యాపించే అవకాశం ఉందని అగ్నిమాపకశాఖ అధికారులు చెబుతున్నారు.

# ఫైనల్‌కు భారత్..



- సెమీస్‌లో కొరియాపై ఘన విజయం

**బలగం టీవీ ,బీజింగ్**
ఆసియా చాంపియన్స్ ట్రోఫీ ఫైనల్లోకి భారత్ వరుసగా రెండోసారి ప్రవేశించింది. సోమవారం కొరియాతో జరిగిన సెమీఫైనల్లో భారత్ 4-1గోల్స్ తేడాతో ఘన విజయం సాధించింది. టీమిండియా.. ఆటగాళ్ల ధాటికి కొరియా డిఫెన్స్ కకావికలం అయింది. గురువారం జరిగే టైటిల్ పోరులో ఆతిథ్య చైనాతో హర్మన్‌ప్రీత్ సింగ్ బృందం తలపడనుంది. దీంతో ఒలింపిక్స్‌లో వరుసగా రెండో కాంస్యంతో నయా చరిత్ర సృష్టించిన భారత జట్టు మరో టైటిల్‌కు చేరువైంది. తొలుత ఉత్తమ్ సింగ్ 13వ నిమిషంలో మొదటి గోల్ అందించాడు. దీంతో తొలి క్వార్టర్ ముగిసేసరికి భారత్ 1-0 ఆధిక్యతలో నిలిచింది. ఆ తర్వాత కెప్టెన్ హర్మన్‌ప్రీత్(19, 45వ నిమిషంలో) రెండు గోల్స్‌తో ఆధిక్యాన్ని మరింత పెంచాడు. ఆ తర్వాత కొరియా ఆటగాళ్లు గోల్ కోసం ఎంత ప్రయత్నించినా భారత డిఫెన్స్, గోల్‌కీపర్ వాళ్ల ఆటలు సాగనివ్వలేదు. జమన్ ప్రీత్ సింగ్(32 నిమిషంలో) మరో గోల్ కొట్టడంతో కొరియా ఆశలకు తెరపడింది. ఈ మ్యాచ్‌లో భారత డిఫెండర్లు అద్భుతంగా రాణించారు. ఫార్వర్డ్‌లో అర్జీత్ సింగ్ మెరిసాడు. కొరియా తరపున ఏకైక గోల్ మూడో క్వార్టర్‌లో నమోదైంది.

**ఫైనల్‌కు చైనా..**
ఆసియా ఛాంపియన్స్ ట్రోఫీలో ఆతిథ్య చైనా టోర్నీ చరిత్రలో తొలిసారి ఫైనల్‌కు దూసుకెళ్లింది. సోమవారం జరిగిన సెమీఫైనల్లో మూడుసార్లు చాంపియన్ పాకిస్థాన్‌ను షూటౌట్‌లో చిత్తుచేసింది. ఆట ఆరంభం నుంచి పాక్ జట్టుకు ముచ్చెమటలు పట్టించిన చైనా ఆటగాళ్లు 1-1తో స్కోర్ సమం చేశారు. ఆ తర్వాత జరిగిన పెనాల్టీ షూటౌట్‌లోనూ చైనా ఆటగాళ్లు అద్భుతం చేశారు. 2-0తో ఆధిపత్యం కనబరిచి పాక్‌ను సాగనంపారు. పాకిస్తాన్‌కు ఐదుసార్లు పెనాల్టీ కార్నర్‌ల ద్వారా గోల్ కొట్టేందుకు అవకాశం లభించినా.. చైనా డిఫెన్స్ చిత్తుచేసింది. 37వ నిమిషంలోలో అహ్మద్ నదీమ్ ఒక గోల్ కొట్టగా.. చైనా తరపున ఏకైక గోల్‌ను 18వ ని.లో డ్రాగ్‌ఫికర్ యువాన్లిక్ చేశాడు. చైనా గోల్ కీపర్ సైయు వాంగ్ జట్టుకు అడ్డుగోడలా నిలిచి జట్టు గెలుపులో కీలకపాత్ర పోషించాడు. దీంతో చైనా తొలిసారి ఫైనల్లోకి దూసుకెళ్లింది. పాకిస్తాన్, కొరియా జట్ల మధ్య కాంస్య పతకం పోరు జరగనుంది.



## యూనియన్ బ్యాంక్ ఆకర్షణీయ ఎఫ్‌డీ ప్లాన్

**బలగం టీవీ, హైదరాబాద్**
ప్రభుత్వ రంగ సంస్థ యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (యుబిఐ) ఖాతాదారుల నుంచి డిపాజిట్లను ఆకర్షించడానికి కొత్త ప్లాన్‌ను ఆవిష్కరించింది. 333 రోజుల కాలపరిమితితో యూనియన్ సమృద్ధి స్కీంను ప్రవేశపెట్టింది. ఇందులో కనీసంగా రూ.1,000 నుంచి రూ.3 కోట్ల లోపు డిపాజిట్ చేయడానికి వీలుంది. ఈ స్కీంపై సాధారణ ప్రజలకు 7.40 శాతం వార్షిక వడ్డీని చెల్లించనుంది. సీనియర్ సిటిజన్లకు 7.90 శాతం, సూపర్ సీనియర్ సిటిజన్లకు 8.15 శాతం వడ్డీని అందిస్తున్నట్లు యూనియన్ బ్యాంక్ తెలిపింది. ఎఫ్‌డి కాలపరిమితి ముగియక ముందే ఉపసంహరించు కోవడానికి వీలుంది. అయితే మధ్యంతరంగా ఎఫ్‌డిని ఉపసంహరించుకుంటే ఒక్క శాతం వడ్డీని తగ్గించుకోని చెల్లించనుంది. తమ అన్ని శాఖల్లోనూ సమృద్ధి స్కీం పథకం అందుబాటులో ఉంటుందని ఆ బ్యాంక్ తెలిపింది.




## ఓటీటీలో హనీమూన్ ఎక్స్‌ప్రెస్ రికార్డు

**బలగం టీవీ, హైదరాబాద్**
హెబ్బా పటేల్ చైతన్యరావుతో కలిసి నటించిన చిత్రం హనీమూన్ ఎక్స్‌ప్రెస్. బాల రాజశేఖరుని రైటర్ కమ్ డైరెక్టర్‌గా వ్యవహరించిన ఈ చిత్రం జూన్ 21న థియేటర్లలో విడుదల కాగా.. మిశ్రమ స్పందన రాబట్టుకుంది. ఇక రెండు నెలల తర్వాత ఆగస్టు 27న పాపులర్ ఓటీటీ ప్లాట్‌ఫాం అమెజాన్ ప్రైమ్ వీడియోలోకి ఎంట్రీ ఇచ్చింది. ప్రేమ, పెండ్లి, విడాకుల కాన్సెప్ట్‌తో యూత్‌ను ఆకట్టుకుంటూ ఓటీటీలో సక్సెస్‌ఫుల్‌గా స్ట్రీమింగ్ అవుతోంది. తాజాగా హనీమూన్ ఎక్స్‌ప్రెస్ ప్రైమ్‌లో 40 మిలియన్లకుపైగా స్ట్రీమింగ్ మినిట్స్‌తో అందరి అటెన్షన్‌ను తమ వైపునకు తిప్పుకుంటోంది. మరి రాబోయే రోజుల్లో ఎలాంటి ట్రెండ్ క్రియేట్ చేస్తుందనేది ఆసక్తికరంగా మారింది. ఈ చిత్రంలో తనికెళ్ల భరణి, సుహాసిని కీలక పాత్రల్లో నటించగా.. అరవింద్ కృష్ణ, అలీ, సురేఖ వాణి, రవి వర్మ ఇతర కీ రోల్స్ పోషించారు. ఈ చిత్రాన్ని ఎన్‌ఆర్ఐ ఎంటర్‌టైన్‌మెంట్స్ (యూఎస్‌ఏ) సమర్పణలో న్యూ రీల్ ఇండియా ఎంటర్టైన్మెంట్స్ ప్రైవేట్ లిమిటెడ్ బ్యానర్‌పై తెరకెక్కించగా.. కళ్యాణిమాలిక్ సంగీతం అందించారు.




## ఆసక్తికరంగా సుహాస్ 'గొర్రెపురాణం' ట్రైలర్

**బలగం టీవీ, హైదరాబాద్**
టాలీవుడ్ యువ హీరో సుహాస ప్రధాన పాత్రల్లో నటిస్తున్న తాజా చిత్రం గొర్రెపురాణం. ఈ సినిమాకు బాబీ దర్శకత్వం వహిస్తుండగా.. ఫోకల్ సినిమాస్ బ్యానర్‌పై ప్రవీణ్ రెడ్డి సినిమాను నిర్మిస్తున్నాడు. ఈ సినిమాను సెప్టెంబర్ 20న ప్రేక్షకుల ముందుకు తీసుకురానున్నట్లు చిత్రబృందం ఇప్పటికే ప్రకటించింది. విడుదలకు ఇంకా నాలుగు రోజులే ఉండడంతో ట్రైలర్‌ను వదిలింది చిత్రయూనిట్. ఈ ట్రైలర్ చూస్తుంటే.. ఒక గొర్రె చేసిన పని వలన రెండు మతాలకు చెందిన ప్రజలు గొడవపడుతున్నట్లు ట్రైలర్ చూస్తే తెలుస్తుంది. అయితే అసలు గొడవ ఏంటి.. రెండు మతాలకు చెందిన ఆ ఊరి ప్రజలు అసలు గొర్రెను ఎందుకు చంపాలి అనుకుంటారు. సుహాస్ జైలులో ఎందుకు ఉంటాడు. గొర్రెకు సుహాస్‌కు సంబంధం ఏంటి అనేది తెలియాలంటే ఈ సినిమా సినిమా చూడాల్సిందే.

## 98 పాయింట్లు లాభపడ్డ సెన్సెక్స్..

**బలగం టీవీ, ముంబై**
దేశీయ స్టాక్ మార్కెట్లు స్వల్ప లాభాల్లో ముగిశాయి. క్రితం సెషన్‌తో పోలిస్తే 82,985.33 పాయింట్ల వద్ద ఫ్లాట్‌గా మొదలైంది. ఆ తర్వాత కొద్దిసేపటికే మార్కెట్లు నష్టాల్లోకి జారుకున్నాయి. మధ్యాహ్నం తర్వాత మళ్లీ కోలుకున్నాయి. ఈ క్రమంలో సెన్సెక్స్, నిఫ్టీ జీవితకాల గరిష్ఠానికి చేరాయి. ఇంట్రాడేలో 82,832.82 పాయింట్లకు చేరిన సెన్సెక్స్.. గరిష్ఠంగా 83,184.34 పాయింట్లకు చేరి ఆల్‌టైమ్ హైకి చేరింది. చివరకు 97.84 పాయింట్ల లాభంతో 82,988.78 వద్ద ముగిసింది. 27.25 పాయింట్ల లాభంతో 25,383.75 వద్ద స్థిరపడింది.

ట్రేడింగ్‌లో దాదాపు 2,080 షేర్లు పురోగమించాయి. 1862 షేర్లు పతనమయ్యాయి. నిఫ్టీలో ఎన్‌టీపీసీ, జెఎస్‌డబ్ల్యూ స్టీల్, హిందాల్కో ఇండస్ట్రీస్, శ్రీరామ్ ఫైనాన్స్, ఎల్‌అండ్‌టీ లాభపడ్డాయి. బజాజ్ ఫైనాన్స్, హెచ్‌యుఎల్, బజాజ్ ఫిన్‌సర్వ్, ఎస్‌బీఐ లైఫ్ ఇన్సూరెన్స్, బ్రిటానియా ఇండస్ట్రీస్ నష్టపోయాయి. సెక్టార్లలో ఎఫ్ఎంసీజీ, టెలికాం మినహా, ఇతర అన్ని రంగాల సూచీలు బ్యాంక్, క్యాపిటల్ గూడ్స్, పవర్, రియాల్టీ, మీడియా, మెటల్ 0.4 నుంచి ఒకశాతం లాభంతో లాభాల్లో ముగిశాయి. బీఎస్ఈ మిడ్‌క్యాప్ ఇండెక్స్ ఫ్లాట్‌గా ముగియగా, స్మాల్‌క్యాప్ ఇండెక్స్ 0.3 శాతం పెరిగింది.

# బీ వర్సెస్ సీ మ్యాచ్ డ్రా



**బలగం టీవీ, అనంతపురం**

దులీప్ ట్రోఫీ రెండో రౌండ్‌లో భాగంగా జరిగిన ఇండియా–బీ వర్సెస్ ఇండియా–సీ మ్యాచ్ డ్రాగా ముగిసింది. ఓవర్‌నైట్ స్కోరు 309/7తో ఆఖరి రోజు ఆటను ఆరంభించిన ఇండియా–బీ ఆలౌట్ అవ్వడానికి ఎక్కువ సమయం పట్టలేదు. మరో 23 పరుగులే జోడించి మూడు వికెట్లు కోల్పోయింది. దాంతో మొదటి ఇన్నింగ్స్‌లో 332 పరుగులకు ఆలౌటైంది.ఓపెనర్, కెప్టెన్ అభిమన్యు ఈశ్వరన్ (157 నాటౌట్ 286 బంతుల్లో, 14 ఫోర్లు, 1 సిక్సర్) అజేయంగా నిలిచాడు. అన్షుల్ ఏకంగా ఎనిమిది వికెట్లు తీశాడు.

అనంతరం 193 పరుగుల ఆధిక్యంతో రెండో ఇన్నింగ్స్ ఆరంభించిన ఇండియా–సీ ఆఖరి రోజు ఆట ముగిసేసరికి నాలుగు వికెట్లు కోల్పోయి 128 పరుగులు చేసింది. కెప్టెన్ రుతురాజ్ గైక్వాడ్ (62, 93 బంతుల్లో, 8 ఫోర్లు, 1 సిక్సర్) అర్ధశతకంతో సత్తాచాటాడు. రజత్ పటిదార్ (42, 84 బంతుల్లో, 5 ఫోర్లు) ఫర్వాలేదనిపించాడు. తొలి ఇన్నింగ్స్ సెంచరీ హీరో ఇషాన్ కిషాన్ ఒక్క పరుగుకే ఔటయ్యాడు. సాయి సుదర్శన్ (11) నిరాశపరిచాడు. రాహుల్ చాహర్ రెండు, ముకేశ్, ముషీర్ ఖాన్ చెరో వికెట్ తీశారు.

అంతకుముందు మొదటి ఇన్నింగ్స్‌లో ఇండియా–సీ 525 పరుగుల భారీ స్కోరు సాధించింది. ఇషాన్ కిషన్ (111), మానవ్ సుతార్ (82), ఇంద్రజిత్ (78), రుతురాజ్ గైక్వాడ్ (58) పరుగులు చేశారు. ముకేశ్ కుమార్, రాహుల్ చాహర్ చెరో నాలుగు వికెట్లు తీశారు. కాగా, దులీప్ ట్రోఫీ పాయింట్ల టేబుల్‌లో ఇండియా–సీ 9 పాయింట్లతో టాప్‌లో ఉంది. ఇండియా–బీ 7 పాయింట్లతో, ఇండియా–ఏ 6 పాయింట్లతో రెండు, మూడు స్థానాల్లో ఉన్నాయి. ఆఖరి స్థానంలో ఉన్న ఇండియా–డీ ఇంకా పాయింట్ల ఖాతా తెరవలేదు.

# ఇండియా ఏ దే గెలుపు

**బలగం టీవీ, అనంతపురం**



దులీప్ ట్రోఫీలో ఇండియా–ఏ బోణి కొట్టింది. ఇండియా డీతో జరిగిన మ్యాచ్‌లో 186 పరుగుల తేడాతో గెలుపొందింది. ఓవర్‌నైట్ స్కోరు 62/1తో, 488 పరుగుల భారీ లక్ష్యంతో ఇఆఖరి రోజు ఆటను ఆరంభించిన ఇండియా–డీ 301 పరుగులకు ఆలౌటైంది. ఆంధ్రా కుర్రాడు రికీ భుయ్ (113, 195 బంతుల్లో, 14 ఫోర్లు, 3 సిక్సర్) పోరాడాడు. ఆట ఆరంభమైన కాసేపటికే యశ్ దూబె (34), ఫస్ట్ ఇన్నింగ్స్ హీరో దేవదత్ పడిక్కల్ (1) స్వల్ప వ్యవధిలోనే ఔటయ్యారు. అనంతరం శ్రేయస్ అయ్యర్ (41), సంజు శాంసన్ (40)తో కలిసి రికీ భుయ్ ఇన్నింగ్స్ చక్కదిద్దడానికి ప్రయత్నించారు. కానీ జట్టు–ఏ బౌలర్లు పుంజుకుని కీలక దశలో వికెట్లు పడగొట్టారు. అయ్యర్‌తో రికీ భుయ్ నాలుగో వికెట్‌కు 53 పరుగులు, శాంసన్‌తో అయిదో వికెట్‌కు 62 పరుగులు జోడించాడు. తనుష్ కొటియన్ నాలుగు, షామ్స్ ములాని మూడు వికెట్లు తీశారు.

# భారత్ ఘోర ఓటమి




**బలగం టీవీ, హైదరాబాద్**

డేవిస్ కప్ ప్రపంచ గ్రూప్–1లో స్వీడన్ చేతిలో భారత్ ఘోర పరాజయాన్ని చవిచూసింది. 0–4తో ఓటమిపాలైంది. డేవిస్ కప్‌లో స్వీడన్ చేతిలో ఇండియాకు ఇది వరుసగా ఆరో ఓటమి. శనివారం జరిగిన రెండు సింగిల్స్ మ్యాచ్‌ల్లో భారత టెన్నిస్ జట్టు ఓటమిపాలైన విషయం తెలిసిందే.శ్రీరామ్ బాలాజి, రామ్‌కుమార్ రామనాథన్‌లు పరాజయాన్ని చవిచూశారు. దీంతో ఆదివారం డబుల్స్, రివర్స్ సింగిల్స్ రెండు మ్యాచ్‌ల్లోనూ భారత్ తప్పక నెగ్గాల్సిన పరిస్థితి ఏర్పడింది. కానీ మన క్రీడాకారులు సత్తాచాటలేకపోయారు. ముందుగా జరిగిన డబుల్స్‌లో ఓటమిపాలై స్వీడన్‌కు విజయాన్ని ఖరారు చేశారు. ఇక నామమాత్రపు రివర్స్ సింగిల్స్‌లోనూ ఓడి 0–4తో నిలిచారు. దీంతో నిరూపయోగంగా చివరి రివర్స్ సింగిల్స్ మ్యాచ్‌ను నిర్వహించలేదు.

డబుల్స్ మ్యాచ్‌లో ఆండ్రీ గొరాన్సన్– ఫిలిప్ బెర్గెవి జోడీ చేతిలో శ్రీరామ్ బాలాజీ–రామ్‌కుమార్ రామనాథన్ జంట 3–6, 4–6 తేడాతో ఓటమిపాలైంది. తొలి సెట్‌లో ఓ దశలో 2–2తో బాలాజీ–రామ్ జోడీ గట్టిపోటీనే ఇచ్చింది. రెండో సెట్‌లోనూ 3–3తో హెూరాహెూరీగా పోటీ పడింది. కానీ అదే జోరును పూర్తిగా కొనసాగించలేకపోయారు.

నామమాత్ర రివర్స్ సింగిల్స్ మ్యాచ్‌లోనూ భారత్‌కు ఊరట దక్కలేదు. డేవిస్ కప్‌లో తొలిసారి భారత్‌కు ప్రాతినిధ్యం వహిస్తున్న జాతీయ మాజీ ఛాంపియన్ సిద్ధార్థ్... 2–6, 2–6తో ఎలియాస్ చేతిలో పరాజయాన్ని చవిచూశాడు. భారత్‌పై ఘన విజయం సాధించిన స్వీడన్ వరల్డ్ గ్రూప్ క్వాలిఫయిర్స్‌కు అర్హత సాధించింది. మరోవైపు భారత్ వచ్చే ఏడాది డేవిస్ కప్ వరల్డ్ గ్రూప్–1లో చోటు సంపాదించడం కోసం ప్లేఆఫ్ దశ మ్యాచ్‌లు ఆడనుంది. ఈ సారి టాప్ ప్లేయర్లు సుమిత్ నగాల్, యూకీ బాంబ్రీ లేకపోవడం భారత్‌కు ప్రతికూలంగా మారింది.



# విరాట్ బాదుడు.. గోడ బద్దలు

**బలగం టీవీ, చెన్నై**

విరాట్ కోహ్లీ బ్యాట్‌తో బాదుడుకు ఓ గోడ బద్దలైంది. ఈ ఘటన చెన్నైలోని చెపాక్ స్టేడియంలో చోటుచేసుకుంది. వివరాల్లోకెళ్తే.. కెప్టెన్ రోహిత్ శర్మ సారథ్యంలో భారత్ బంగ్లాదేశ్‌తో టెస్టు సిరీస్‌కు సిద్ధమౌతోంది. ఈ సిరీస్‌లో బంగ్లాదేశ్‌తో భారత్ రెండు టెస్టు మ్యాచ్‌లు ఆడనుంది. ఇక సెప్టెంబర్ 19న చెన్నై వేదికగా తొలి టెస్టు ప్రారంభం కానుంది. ఈ నేపథ్యంలో టీమ్‌ఇండియా ప్లేయర్లంతా చెన్నై చేరుకొని ప్రాక్టీస్ మొదలు పెట్టారు. ఈ క్రమంలోనే స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ నెట్స్‌లో సాధనచేస్తున్నాడు. ఈ క్రమంలో విరాట్ బాదిన ఓ షాట్‌కు చెపాక్ స్టేడియంలోని గోడ బద్దలైంది. సిరీస్ బ్రాడ్‌కాస్టర్ జియో సినిమా ఈ మేరకు ఓ వీడియో సోషల్ మీడియాలో షెర్ చేసింది. దీంతో ఈ వీడియో ప్రస్తుతం వైరల్‌గా మారింది.



# కాలర్ పట్టుకుని ట్రక్ డ్రైవర్‌తో గంభీర్ గొడవ..!


**బలగం టీవీ, హైదరాబాద్**

టీమ్ ఇండియా హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్, వివాదాలతోనూ నిత్యం వార్తల్లో నిలుస్తూ ఉంటాడు. అయితే మైదానంలోపలే కాదు బయట కూడా గంభీర్ గొడవకు ఏమాత్రం తగ్గడని కామెంటేటర్ ఆకాశ్ చోప్రా అన్నాడు. తాజాగా ఓ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ రోడ్డుపై ట్రక్ డ్రైవర్‌తో గంభీర్ గొడవ పడిన సంఘటన గురించి చెప్పాడు. గంభీర్‌కు త్వరగా కోపం వస్తుందని, అలాగే లోతైన భావోద్వేగంతో ఉంటాడని తెలిపాడు.

“ఒకసారి ఢిల్లీలో గౌతమ్ గంభీర్ ట్రక్ డ్రైవర్‌తో గొడవపడ్డాడు. కారులో నుంచి దిగి, ట్రక్ పైకి ఎక్కి డ్రైవర్ కాలర్ పట్టుకున్నాడు. ట్రక్ డ్రైవర్ రాంగ్ టర్న్ చేశాడు. అంతేగాక గంభీర్‌ను దుర్భాషలాడాడు. దాంతో, తనకు జరిగిన అవమానంతో రగిలిపోయిన గంభీర్ ఏమాత్రం వెనక్కి తగ్గలేదు. కోపంతో ఊగిపోయిన అతడు వెంటనే తన కారులోంచి దిగి.. ఆ లారీ డ్రైవర్ చొక్కా కాలర్ పట్టుకున్నాడు. అడ్డదిడ్డంగా లారీ నడపడమే కాకుండా నన్నే దబాయిస్తావా? అని గట్టిగా చివాట్లు పెట్టాడు గంభీర్ కాస్త సీరియస్‌గా ఉంటాడు. కానీ ఎన్నో పరుగులు చేశాడు. బాధ్యతలను భుజాలపై వేసుకుని ఎప్పుడూ ఆడతాడు. నేను, గంభీర్ మంచి స్నేహితులం కాదు. ఎందుకంటే ఇద్దరం ఢిల్లీ తరఫున ఆడేటప్పుడు ఓపెనర్ స్థానం కోసం తీవ్రంగా పోటీ పడేవాళ్లం.” అని ఆకాశ్ చోప్రా చెప్పుకొచ్చాడు. అయితే గంభీర్, తాను మంచి స్నేహితులం కాలేకపోయామని ఆకాశ్ చోప్రా వెల్లడించాడు. గంభీర్, తాను కలిసి ఆడే సమయంలో ఢిల్లీ జట్టు చాలా బలంగా ఉండేదని చెప్పుకొచ్చాడు. టీమ్ ఇండియా దిగ్గజ ప్లేయర్లు కోహ్లీ, ధావన్‌లలో ఒకరి మాత్రమే జట్టులో అవకాశం వచ్చేదని వివరించాడు. వీరేంద్ర సెహ్వాగ్ నాలుగో స్థానంలో బ్యాటింగ్ వస్తే, ధావన్ లేదా కోహ్లీని మూడో ప్లేస్‌లో బ్యాటింగ్ పంపేవాళ్లమని వెల్లడించాడు.

# ఇది మునపటి బంగ్లాదేశ్ కాదు : సునీల్ గవాస్కర్

**బలగం టీవీ, హైదరాబాద్**



టీమిండియా స్వదేశంలో బంగ్లాదేశ్‌తో రెండు టెస్టుల సిరీస్ ఆడనుంది. సెప్టెంబర్ 19 నుంచి ప్రారంభమయ్యే ఈ సిరీస్‌లో తొలి మ్యాచ్‌కు చెన్నై వేదిక కానుంది. సెప్టెంబర్ 27 నుంచి కాన్పూర్ వేదికగా చివరి టెస్టు జరగనుంది. ఈ సిరీస్‌ను క్వీన్‌స్వీప్ చేసి వరల్డ్ టెస్టు ఛాంపియన్‌షిప్ ఫైనల్స్‌కు అవకాశాలను మరింత మెరుగుపర్చుకోవాలని భారత్ పట్టుదలతో ఉంది. అయితే ఇది మునపటి బంగ్లాదేశ్ కాదని, పాకిస్థాన్‌ను వైట్ వాష్ చేసిన నూతన ఉత్సాహంతో బరిలోకి దిగుతుందని భారత దిగ్గజ క్రికెటర్ సునీల్ గవాస్కర్ అన్నాడు. బంగ్లాదేశ్‌ను తేలికగా తీసుకోకూడదని సూచించాడు. తాజాగా ఆయన మాట్లాడుతూ “ఆడిన రెండు టెస్టుల్లో పాకిస్థాన్‌ను ఓడించి బంగ్లాదేశ్ తమ సామర్థ్యాన్ని చాటిచెప్పింది. కొన్నేళ్ల క్రితం భారత పర్యటనకు వచ్చిన బంగ్లాదేశ్ తీవ్రంగానే ప్రతిఘటిం చింది. అయితే పాకిస్థాన్ ఓడించిన వాళ్లు ఈసారి భారత్‌పై సత్తాచాటాలని భావిస్తున్నారు. బంగ్లా జట్టులో కొందరు ఉత్తమ ప్లేయర్లు ఉన్నారు. మరికొందరు ప్రతిభావంతులైన యువకులు ఉన్నారు. ప్రత్యర్థికి భయపడకుండా తమ అంతర్జాతీయ క్రికెట్ ఆరంభాన్ని గొప్పగా లిఖించాలని ఉవ్విళ్లూరుతున్నారు. ఇక పాకిస్థాన్ పరాజయంతో బంగ్లాదేశ్‌ను తక్కువగా అంచనా వేయకూడదని ప్రతి జట్టుకు తెలిసివచ్చింది. భారత్–బంగ్లాదేశ్ సిరీస్ కచ్చితంగా ఆసక్తికరంగా మారుతుంది” అని సునీల్ గవాస్కర్ అన్నాడు.